క్లుప్తంగా

సబ్సిడీ ఉలవలు సద్వినియోగం చేసుకోండి

ఎన్పీకుంట: ప్రత్యామ్నాయ సాగు కోసం ప్రభుత్వం 80 శాతం రాయితీపై అందిస్తున్న ఉలవలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి లోకేశ్వర రెడ్డి సూచించారు. సోమవారం ఆయన మాట్లాడుతూ మండలానికి 400 క్వింటాళ్ల ఉలవలు మంజూరయ్యాయని తెలిపారు. ఆసక్తిగల రైతులు మంగళవారం నుంచి రైతు సేవా కేంద్రంలో రిజిస్ట్రేషన్లు చేసుకోవచ్చన్నారు. 80 శాతం సబ్సిడీ పోగా 10 కిలోల ఉలవల ప్యాకెట్‌కు రూ.174 రైతులు చెల్లించాలని తెలిపారు.

రామగిరి సీఐగా శ్రీధర్



చెన్నేకొత్తపల్లి: రామగిరి నూతన సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా శ్రీధర్ సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఈయన అనంతపురం జిల్లా బుక్కరాయసముద్రం సర్కిల్ సీఐగా పని చేస్తూ బదిలీపై రామగిరి సర్కిల్‌కు వచ్చారు. ఇక్కడ సీఐగా పని చేస్తున్న శివాంజనేయులు పుట్టపర్తి వీఆర్‌కు బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా నూతన సీఐ మాట్లాడుతూ.. సర్కిల్ పరిధిలోని కనగానపల్లి, రామగిరి, చెన్నేకొత్తపల్లి మండలాల్లో జూదం, మట్కా మద్యం అక్రమ రవాణా తదితర అసాంఘిక కార్యక్రమాలపై గట్టి నిఘా ఉంచుతామన్నారు. సర్కిల్ పరిధిలో శాంతి భద్రతలకు విఘాతం కలిగించే వారు ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదన్నారు.

12 నుంచి స్కూల్ గేమ్స్

ధర్మవరం రూరల్: పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో ఈ నెల 12 నుంచి 13 వరకు స్కూల్ గేమ్స్ పోటీలు నిర్వహించనున్నట్లు ఎంఈఓ గోపాల్ నాయక్ తెలిపారు. ఈ మేరకు సోమవారం ఎమ్మార్సీ భవనంలో పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. ఎంఈఓతో పాటు మండల కోఆర్డినేటర్ పీడీ రఘునాథ్ మాట్లాడుతూ వాలీబాల్, ఖోఖో, కబడ్డీ, బ్యాడ్మింటన్, చెస్, యోగా, అలాగే బాలికలకు అండర్-14, అండర్- 17 విభాగాల్లో నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయులు లక్ష్మీనారాయణ, సరళ, మండలంలోని వ్యాయామ ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ నేత మృతి




మృతుడు లక్ష్మిరెడ్డి

అమడగూరు: కంచరవాండ్లపల్లికి చెందిన వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు దాదిమి లక్ష్మిరెడ్డి (70) అనారోగ్యంతో సోమవారం మృతి చెందాడు. విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ నాయకులు గ్రామానికి వెళ్లి మృతదేహానికి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి, ధైర్యం చెప్పారు.

మాతాశిశు మరణాలు ఉండకూడదు

ఓడీచెరువు : మాతాశిశు మరణాలు సంభవించకుండా చూడాలని వైద్యాధికారి డాక్టర్ కమల్ రోహిత్ సూచించారు. సోమవారం ఓడీసీ పీహెచ్‌సీలో ప్రధానమంత్రి సురక్షిత్ మాతృత్వ అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. 29 మంది గర్భిణులకు పరీక్షలు నిర్వహించి.. వారిలో 15 మందిని హైరిస్క్ కేసులుగా గుర్తించి అత్యవసర చికిత్స కోసం సిఫార్సు చేసినట్లు వైద్యాధికారి తెలిపారు. ఈ సందర్భంగా గర్భిణులకు కదిరి రోటరీ క్లబ్ వారు అన్నదానం చేశారు. కార్యక్రమంలో సుభాషిణి, దిల్షాద్, విజయకుమారి తదితర ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

వేతనాలివ్వకపోతే ఎలా?



ధర్మవరంలో నిరసన

తాడిమర్రి: చేసిన పనికి వేతనాలు ఇవ్వకపోతే ఎలా జీవించాలని శ్రీసత్యసాయి తాగునీటి సరఫరా విభాగం కార్మికులు ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. తమ డిమాండ్ల సాధన కోసం కార్మికులు తాడిమర్రిలో చేపట్టిన సమ్మె 19వ రోజు సోమవారం కూడా కొనసాగింది. పెండింగ్‌లో ఉన్న 6 నెలల వేతనాలు, నాలుగేళ్ల బోనస్, ఈపీఎఫ్, ఈఎస్‌ఐ చెల్లింపులు విడుదల చేయాలని వారు ప్రభుత్వాన్ని కోరారు.

కార్మికులను ఆదుకోవాలి

బత్తలపల్లి: సత్యసాయి తాగునీటి సరఫరా కార్మికులను ప్రభుత్వం తక్షణమే ఆదుకోవాలని కార్మికులు డిమాండ్ చేశారు. సోమవారం మండల కేంద్రం బత్తలపల్లిలోని సత్యసాయి వాటర్ ట్యాంకు వద్ద మండలంలో పని చేస్తున్న సత్యసాయి తాగునీటి సరఫరా కార్మికులు మోకాళ్లపై నిల్చుకుని నిరసన తెలిపారు.

గుంజీలు తీస్తూ నిరసన

ధర్మవరం అర్బన్: పట్టణంలోని లక్ష్మీచెన్నకేశవపురం వద్దనున్న సత్యసాయి పంప్ హౌస్ వద్ద కార్మికులు సోమవారం సమ్మెలో భాగంగా గుంజీలు తీస్తూ నిరసన చేశారు.

కాంగ్రెస్ రాష్ట్ర ఉపాధ్యక్షునిగా కోటా సత్యం

పుట్టపర్తి టౌన్: కాంగ్రెస్ రాష్ట్ర ఉపాధ్యక్షునిగా కోటా సత్యనారాయణ నియమితులయ్యారు. ఈ మేరకు పార్టీ జనరల్ సెక్రటరీ వేణుగోపాల్ ఉత్తర్వులు జారీ చేశారు.



ఎన్పీకుంటలో శోభాయాత్రలో చెక్కభజన



ధర్మవరంలో క్రేన్‌ల సాయంతో వినాయకులను తరలిస్తున్న ప్రజలు



బత్తలపల్లిలో నిమజ్జనానికి ఊరేగింపుగా వెళ్తున్న వినాయక విగ్రహాలు

వినాయకా.. సెలవిక..

వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకుని వాడవాడలా కొలువుదీరిన బొజ్జ గణపయ్య మూడు రోజులపాటు ప్రత్యేక పూజలు అందుకుని సోమవారం గంగమ్మ చెంతకు చేరుకున్నారు. పల్లె, పట్టణం, మండల కేంద్రం, జిల్లా కేంద్రంలో కొలువుదీరిన విగ్రహాల శోభాయాత్ర భక్తిశ్రద్ధలతో సాగింది. కాలువలు, నీటికుంటల్లో విగ్రహాల నిమజ్జనోత్సవం నిర్వహించారు. జై బోలో గణేష్ మహరాజ్‌కీ జై అంటూ భక్తులు వీడ్కోలు పలికారు. శోభాయాత్ర సాగిన మార్గాల్లో షేర్నీడ్రమ్స్ వాయిద్యాలు, డీజే సౌండ్ నడుమ సాగిన నిమజ్జనోత్సవం ఆసాంతం సందడిగా కనిపించింది.

- భక్తిశ్రద్ధలతో వినాయక నిమజ్జనం
- సందడిగా సాగిన శోభాయాత్ర



పుట్టపర్తిలో వినాయకుడిని నిమజ్జనానికి ఊరేగింపుగా తీసుకెళ్తున్న దృశ్యం

పుట్టపర్తి టౌన్/ ప్రశాంతి నిలయం: పుట్టపర్తి పట్టణంలోని వినాయక ప్రతిమలను ఎనుములపల్లి, సాహెబ్‌చెరువుకు తరలించి నిమజ్జనం చేశారు. సీఐ సునీత ఆధ్వర్యంలో గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. ప్రశాంతి నిలయం, సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ కార్యాలయాల్లో కొలువుదీర్చిన విగ్రహాలను భక్తిశ్రద్ధలతో గణేశ్ నిమజ్జనం నిర్వహించారు. సత్యసాయి విద్యాసంస్థల విద్యార్థులు, సిబ్బంది సత్యసాయి మహాసమాధి చెంత నృత్య ప్రదర్శన, భక్తిగీతాల ఆలాపన చేశారు.

ధర్మవరం అర్బన్: పట్టణంలోని పలు వార్డుల్లోని బొజ్జ గణపయ్యల నిమజ్జనం సోమవారం భక్తిశ్రద్ధలతో సాగింది. యువకులు, మహిళలు రంగులు చల్లుకుంటూ కేరింతలు కొడుతూ డ్యాన్స్‌లు చేస్తూ వినాయక విగ్రహాలను ట్రాక్టర్లలో నిమజ్జనానికి తరలించారు. ధర్మవరం చెరువుతోపాటు కుణుతూరు వంక, గొళ్లపల్లి వంకలలో నిమజ్జనం చేశారు. చెరువులో ప్రజలు దిగకుండా క్రేన్‌ల సాయంతో విగ్రహాల నిమజ్జన ఘట్టం ముగించారు.

బత్తలపల్లి: మండల కేంద్రమైన బత్తలపల్లిలో వినాయక విగ్రహాలను సోమవారం వైభవంగా నిమజ్జనం చేశారు. ట్రాక్టర్లను అందంగా ముస్తాబు చేసి అందులో వినాయక విగ్రహాలను ఉంచి ఊరేగింపు నిర్వహించారు. ఉత్సవ కమిటీ సభ్యులు ముందు భాగాన వెళుతూ భక్తులను ఉత్తేజపరిచారు. బాణసంచా కాలుస్తూ భక్తులు ఆనందోత్సవాలు జరుపుకున్నారు. పలు విగ్రహాల వద్ద నిర్వాహకులు భక్తులకు అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. అలాగే యువకులు ఉట్టి కొట్టే కార్యక్రమాన్ని ప్రజలు ఆసక్తిగా తిలకించారు. వినాయకుడి వద్ద ప్రసాదంగా ఉంచిన లడ్డూల వేలం పోటాపోటీగా జరిగింది. ఎస్‌ఐ శ్రీనివాసులు, ఏఎస్‌ఐలు సోమశేఖర్‌మూర్తి, తిరుపాలు, నాగరాజు తమ సిబ్బందితో బందోబస్తు నిర్వహించారు. రామాపురం సమీపంలోని చిత్రావతి నదిలో నిమ్మజ్జనం జరిగింది. మండలంలోని పోట్లమర్రి, గంటాపురం, మాల్యవంతం, చీమలనాగేపల్లి, అప్రాచెరువు, తంబాపురం, రామాపురం, నల్లబోయనపల్లి, ముష్టూరు, రాఘవంపల్లి, ముద్దనపల్లి, కాటమకుంట, సంజీవపురం, ఓబుళాపురం, సంగాల, గరిశలపల్లి, దంపెట్ల, డి.చెర్లోపల్లి, గుమ్మల్లకుంట, నెత్తివారంపల్లి, కోడేకండ్ల, రామాపురం తదితర గ్రామాల్లోను నిమజ్జనం వేడుకలు ప్రశాంతంగా జరిగాయి.

ఉత్సాహంగా నిమజ్జనోత్సవం

గాండ్లపెంట: మండలంలోని పలు గ్రామాల్లో యువకులు, గ్రామస్తులు సోమవారం వినాయక నిమజ్జనోత్సవాన్ని ఉత్సాహంగా నిర్వహించారు. తొలుత స్వామి వారి లడ్డూలను వేలం వేశారు. అవాంఛనీయ ఘటనలు జరగకుండా ఎస్‌ఐ కృష్ణవేణి, ఏఎస్‌ఐ రంగానాయక్ ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు.

బైబై గణేశా...

అమడగూరు: మండలంలో సోమవారం బొజ్జ గణపయ్యల నిమజ్జనం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ప్రత్యేక వాహనాల్లో విగ్రహాలను కొలువుదీర్చి డప్పు, వాయిద్యాల నడుమ యువకులు చిందులేస్తూ బాణసంచ పేల్చుతూ ఊరేగింపు చేశారు. గణేశుడికి బైబై చెప్పారు. సుమారు 30 గ్రామాల్లో నిమజ్జనాలు చేశారు. అవాంఛనీయ ఘటనలు జరగకుండా ఎస్‌ఐ వెంకటనారాయణ చర్యలు చేపట్టారు. కాగా గంగిరెడ్డిపల్లి, అమడగూరులో వినాయక లడ్డూ, పూలహారాలకు వేలం పాట నిర్వహించారు. అత్యధికంగా గంగిరెడ్డిపల్లిలో వినాయక లడ్డూ రూ.45 వేలు పలికింది.

వైభవంగా వినాయక నిమజ్జనం

ఎన్పీకుంట: మండల కేంద్రం ఎన్పీకుంటతో పాటు రెడ్డివారిపల్లి, ధనియానిచెరువు, గోవిందరాజులపల్లి, చీమలచెరువుపల్లి గ్రామాల్లో వినాయకుడి నిమజ్జనం వైభవంగా జరిగింది. విగ్రహాలను ట్రాక్టర్లలో ఊరేగిస్తూ డప్పు, వాయిద్యాల నడుమ మహిళలు, యువకులు రంగులు చల్లుకుంటూ, నృత్యాలు చేస్తూ గణేశుడిని గంగమ్మ చెంతకు సాగనంపారు.

గణపతి బప్పా మోరియా..

తనకల్లు: మండల వ్యాప్తంగా గ్రామాల్లో కొలువుదీరిన వినాయక విగ్రహాలు సోమవారం నిమజ్జనానికి తరలాయి. జై గణేశ్ మహరాజ్‌కీ జై....గణపతి బప్పా మోరియా అంటూ యువకులు నినాదాలతో నృత్యాలు చేస్తూ ముందుకు సాగారు.

యువత కేరింత

తలుపుల : వినాయక నిమజ్జనం సందర్భంగా యువత కేరింతలు కొట్టింది. విగ్రహాలను డప్పు వాయిద్యాల నడుమ ఊరేగిస్తూ నిమజ్జనానికి తీసుకెళ్లారు. ఎస్‌ఐ దిలీప్ కుమార్ పర్యవేక్షణలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

నల్లచెరువు: మండల పరిధిలో వినాయక విగ్రహాల నిమజ్జనం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. యువకులు ఒకరిపై ఒకరు రంగులు చల్లుకుంటూ.. డీజే సాంగ్‌లకు డ్యాన్సులు వేస్తూ ప్రత్యేకంగా అలంకరించిన వాహనాల్లో వినాయకుడిని ఊరేగింపుగా తీసుకెళ్లి చెరువులు, కుంటల్లో నిమజ్జనం చేశారు.

ఘనంగా వినాయక నిమజ్జనం

కదిరి అర్బన్: మండల వ్యాప్తంగా పలు గ్రామాల్లో సోమవారం వినాయక నిమజ్జనం ఘనంగా నిర్వహించారు. సమీపంలో చెరువులు, కుంటల్లో విగ్రహాలను నిమజ్జనం చేశారు.

ఉత్సాహంగా వినాయకుడి నిమజ్జనం

కనగానపల్లి: మండల కేంద్రం కనగానపల్లితో పాటు మామిళ్లపల్లి, తగరకుంట, తూంచర్ల, మద్దెలచెరువు, ముత్తువకుంట్ల, ముక్తాపురం, తదితర గ్రామాల్లో కొలువుదీరిన వినాయకులను ప్రత్యేకంగా అలంకరించిన నిమజ్జనానికి తరలించారు. ఎటువంటి ఘర్షణలు తలెత్తకుండా ఎస్‌ఐ మల్లికార్జునరెడ్డి ఆధ్వర్యంలో గ్రామాల్లో పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

ఉత్సాహంగా గణేశ్ నిమజ్జనం

చెన్నేకొత్తపల్లి: మండల వ్యాప్తంగా అన్ని గ్రామాల్లో వినాయక నిమజ్జనాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆటోలు, ట్రాక్టర్‌లో వినాయకులను కొలువుదీర్చి ఊరేగించారు. భక్తులు స్వామిని దర్శించుకుని పూజలు చేశారు. ఊరేగింపులో యువకులు, చిన్నారులు రంగులు చల్లుకుంటూ చిందులు వేశారు. అనంతరం గ్రామాల సమీపంలోని చెరువులు కాలువల్లో వినాయకుడి విగ్రహాలను నిమజ్జనం చేశారు. గ్రామాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చెన్నేకొత్తపల్లి ఎస్‌ఐ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు.



కదిరి సున్నపుగుట్టతండాలో విగ్రహాలు



కనగానపల్లిలో నిమజ్జనానికి తరలుతూ..



తలుపులలో వినాయక విగ్రహం ఊరేగింపు



మామిళ్లపల్లిలో గణనాథులు



మేడాపురంలో వినాయకుడి ఊరేగింపు



ముదిగుబ్బలో గణేశుడు...



బత్తలపల్లి మండలం రామాపురం వద్దనున్న చిత్రావతిలో నిమజ్జనానికి తరలుతున్న దృశ్యం



గాండ్లపెంటలో వినాయకుడి ఊరేగింపు



జేకే పల్లి, జౌకల గ్రామాల బొజ్జ గణపయ్యలు



తనకల్లు మండలం చీకటిమానిపల్లిలో నిమజ్జనానికి సిద్ధమైన వినాయకుడు



నల్లచెరువులో వినాయకుడి ఊరేగింపు

విద్యుత్ శాఖలో 'కృష్ణ' లీలలు

- 22 ఏళ్లుగా ఒకే సబ్‌స్టేషన్‌లో తిష్ట
- బదిలీ లేకుండా చక్రం తిప్పుతున్న ఉద్యోగి
- అవినీతికి అలవాటుపడి.. సీటు వదలని వైనం



సాక్షి టాస్క్‌ఫోర్స్: ప్రభుత్వ శాఖల్లో ఏ ఉద్యోగికైనా రెండు లేదా మూడు లేదా ఐదు సంవత్సరాలు ఒకేచోట పనిచేస్తే మరొకచోటుకు బదిలీ చేయడం తప్పనిసరి. అయితే అందుకు భిన్నంగా జిల్లాలో ఓ ఉద్యోగి ఒకేచోట 22 ఏళ్లుగా విధులు నిర్వర్తిస్తున్నారు. ఇది నమ్మలేకున్నా నిజం. రాప్తాడు నియోజకవర్గంలోని రామగిరి మండలం పేరూరు 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో ఇది జరిగింది. ఆ అవినీతి కృష్ణుని లీలలు కోకొల్లలుగా ఉన్నట్లు సమాచారం. 1987–88లో పేరూరు పంచాయతీలో మొదట వీడ బ్ల్యూగా విధుల్లో చేరాడు. ఆ తర్వాత విద్యుత్ శాఖ పరిధిలోకి మారాడు. అంచలంచెలుగా పదోన్నతి పొందుతూ వచ్చాడు. 2002 నుంచి ఇప్పటి వరకు ఏకధాటిగా సబ్‌స్టేషన్‌లోనే 'లైన్' పనులు చూస్తున్నాడు. సాధారణ బదిలీలు వచ్చినా ఉన్నతాధికారులను ప్రసన్నం చేసుకుని కదలకుండా ఇక్కడే తిష్ట వేసుకుంటూ వస్తున్నాడు. ఏఈ, ఏడీలను తన గుప్పిట్లో ఉంచుకుని.. తాను చెప్పిందే వేదంగా చలామణి అవుతూ వస్తున్నాడు. ఏ పార్టీ అధికారంలో ఉంటే ఆ పార్టీ ద్వితీయశ్రేణి నాయకులతో సత్సంబంధాలు నెరుపుతూ వారికి ముడుపులు ముట్టచెబుతూ తాను ఎక్కడికీ కదలకుండా స్థానం పదిలం చేసుకుంటూ ముందుకు సాగుతున్నాడు. ఇంతలా ఎందుకు ఆయన ఇక్కడే ఉండాలనుకుంటున్నాడంటే ఇక్కడ అవినీతికి బాగా అలవాటుపడ్డాడు. తాను అడిగినంత డబ్బు ఇవ్వకపోతే ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేయరు.. విద్యుత్ స్తంభాలు నాటరు. విద్యుత్ శాఖకు రుసుము చెల్లించడమే కాదు.. తనకు వ్యక్తిగత ఖజానా నింపితేనే విద్యుత్ పనులు చేస్తుంటాడు. లేదంటే రేపు, మాపు అంటూ తిప్పుకుంటూ మానసిక క్షోభకు గురి చేస్తారని గరిమేకలపల్లి, ఎంసీ పల్లి, తిమ్మాపురం, కొండాపురం, మక్కినవారిపల్లి, పేరూరు, శివపురం, కోనేటినాయినిపాళ్యం, మద్దులచెరువు, భానుకోట, వేపకుంట తదితర రైతులు వాపోతున్నారు. ఓ రైతు ధైర్యం చేసి విజిలెన్స్ అధికారులకు ఫిర్యాదు చేసినా.. విచారణ-చర్యలు ముందుకు సాగకుండా తనదైన శైలిలో అడ్డుకున్నట్లు సమాచారం. లంచాలకు అలవాటుపడిన ఈ ఉద్యోగిని ఇక్కడి నుంచి ఎప్పుడు తప్పిస్తారో.. తమకు ఎప్పుడు మంచి రోజులు వస్తాయోనని ఎదురుచూస్తున్నట్లు రైతులు తెలిపారు. మరి ఉన్నతాధికారులు స్పందిస్తారో లేదో చూడాలి మరి.

మండల పరిషత్ అధ్యక్షురాలిగా గంగోజమ్మ



ఎంపీపీకి అభినందనలు తెలుపుతున్న వైఎస్సార్‌సీపీ మండల నాయకులు

గాండ్లపెంట: మండల పరిషత్ అధ్యక్షురాలి (ఎంపీపీ)గా కటారుపల్లి వైఎస్సార్‌సీపీ ఎంపీటీసీ, వైస్ ఎంపీపీ అయిన బొద్దిపోగుల గంగోజమ్మ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఎంపీడీఓ రామానాయక్‌తో పాటు ఈఓఆర్డీ సునిత, సీనియర్ సహాయకులు అమీర్‌బాషా, జూనియర్ సహాయకులు రమేష్‌రెడ్డి, పలువురు మండల పరిషత్ ఉద్యోగులు ఎంపీపీకి పుష్పగుచ్ఛం అందించి అభినందనలు తెలిపారు. ఇదివరకు ఎంపీపీగా ఉన్న గొడ్డువెలగల ఎంపీటీసీ తాతం జగన్మోహన్ ఈ ఏడాది జూలై 8న తన పదవికి రాజీనామా చేశారు. వైస్ ఎంపీపీగా ఉన్న గంగోజమ్మకు ఎంపీపీ బాధ్యతలు అప్పగించాలని సీఈఓ నుంచి ఆగస్టు 30న ఆదేశాలు వచ్చాయి. దీంతో ఆమె సోమవారం బాధ్యతలు తీసుకున్నారు. తనకు ఈ అవకాశం కల్పించిన వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి, సమన్వయకర్త మక్బూల్ అహ్మద్‌కు ఆమె కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఎంపీపీకి వైఎస్సార్‌సీపీ నాయకులు మండల పరిషత్ కార్యాలయంలో పూలమాల వేసి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ గజ్జల రవీంద్రారెడ్డి, మాజీ జెడ్పీటీసీ సభ్యుడు భాస్కర్‌రెడ్డి, మాజీ కన్వీనర్ పోరెడ్డి చంద్రశేఖరరెడ్డి, తుమ్మలబైలు పెద్ద తండా సర్పంచ్ భూక్యా రవీంద్రనాయక్, బీసీ విభాగం కన్వీనర్ లక్ష్మీనరసింహాగౌడ్, మాజీ డైరెక్టర్ మేకల నరసింహులు, నాయకులు పామిడి ఇక్బాల్, రామాంజులరెడ్డి, సూర్యనారాయణరెడ్డి, ఓబులేసు తదితరులు పాల్గొన్నారు.

బైక్‌ను ఢీకొన్న ట్రాక్టర్

తనకల్లు: మండల పరిధిలోని సీజీ ప్రాజెక్టు సమీపంలో సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలయ్యాయి. అమడగూరు మండలం ఇద్దేవారిపల్లికి చెందిన లక్ష్మీదేవి తన కుమార్తె హారిక, కుమారుడు యశ్వంత్‌తో కలిసి వినాయక నిమజ్జనం తిలకించేందుకు బైక్‌పై ప్రాజెక్టు వద్దకు వచ్చారు. అనంతరం అక్కడి నుంచి స్వగ్రామానికి వెళ్తుండగా ఎదురుగా వస్తున్న ట్రాక్టర్ వీరి బైక్‌ను బలంగా ఢీకొంది. ఈ ప్రమాదంలో లక్ష్మీదేవి, హారిక తీవ్రంగా గాయపడ్డారు. యశ్వంత్ స్వల్పంగా గాయపడ్డాడు. స్థానికులు వెంటనే వారిని కదిరి ఆస్పత్రికి తరలించారు. లక్ష్మీదేవి, హారిక పరిస్థితి ఆందోళనకరంగా ఉండడంతో వైద్యుల సూచన మేరకు అనంతపురం ఆస్పత్రికి పంపారు.

రేపు విద్యుత్ సరఫరాలో అంతరాయం

కదిరి టౌన్: వినాయక నిమజ్జనం సందర్భంగా బుధవారం కదిరి పట్టణంలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ట్రాన్స్‌కో ఏఈ చెన్నకృష్ణ తెలిపారు. ఈ మేరకు సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. వినాయక విగ్రహాలు పట్టణంలో దాదాపు 25 నుంచి 30 అడుగుల మేర ఎత్తు ఉన్నందున ఊరేగింపు సమయంలో ప్రమాదాలు జరగకుండా విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు వెల్లడించారు.

12న వైద్య శిబిరం

చెన్నేకొత్తపల్లి: ఓబుళంపల్లిలో ఈ నెల 12న పుట్టపర్తి శ్రీ సత్యసాయి బాబా మొబైల్ ఆసుపత్రి వైద్య సిబ్బంది ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు ఓబుళంపల్లి శ్రీసత్యసాయి సేవాదళ్ సభ్యులు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు.

వరద సహాయక చర్యల్లో ఘోర వైఫల్యం

- వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త శ్రీధర్‌రెడ్డి





పుట్టపర్తి: విజయవాడను వరదలు ముంచెత్తిన వేళ కూటమి ప్రభుత్వం సహాయక చర్యలు చేపట్టడంలో ఘోర వైఫల్యం చెందిందని వైఎస్సార్‌సీపీ పుట్టపర్తి నియోజకవర్గ సమన్వయకర్త దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి ధ్వజమెత్తారు. వరదలపై ఆయన సోమవారం స్పందించారు. కరకట్టకు ఆనుకుని ఉన్న ముఖ్యమంత్రి చంద్రబాబు ఇంటిని కాపాడేందుకు అధికారులు నీళ్ల మళ్లించడం వల్లే వరద ఉధృతి పెరిగి భారీ నష్టం చేకూరిందన్నారు. ముంపు బాధితులు ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని బిక్కుబిక్కుమంటూ బతుకుతున్నారన్నారు. చంద్రబాబుకు ప్రజల ప్రాణాలంటే లెక్కలేదని మండిపడ్డారు. 2014-15లో పుష్కరాల సందర్భంగా 30 మంది ప్రాణాలను అప్పటి ప్రభుత్వం బలిగొందని గుర్తు చేశారు. ప్రస్తుత కూటమి సర్కార్ నిర్లక్ష్యం వల్ల విజయవాడలో 50 మందికి పైగా అధికారికంగా మృతి చెందారని, జాడ తెలియని వారు చాలామందే ఉన్నారని తెలిపారు. దీనంతటికీ కారణం సీఎం చంద్రబాబు అసమర్థతేనని విరుచుకుపడ్డారు. పబ్లిసిటీపై ఉన్న శ్రద్ధ బాధితులను ఆదుకోవడంలో ఉండటం లేదన్నారు. 2020- 2022లో కోవిడ్ మహమ్మారి ప్రపంచాన్నే వణికించిందని, అంతటి విపత్తులో నాటి సీఎం జగన్ ప్రణాళికాబద్ధంగా నియంత్రణా చర్యలు చేపట్టి.. బాధితులకు వలంటీర్ వ్యవస్థ ద్వారా సహాయక చర్యలు చేపట్టారని గుర్తు చేశారు.

ఇద్దరు వ్యక్తులపై రాళ్లతో దాడి

ధర్మవరం అర్బన్: పట్టణంలోని లోనికోటకు చెందిన వరప్రసాద్, అతని బావ శ్రీనివాసులుపై రిలయన్స్ ట్రెండ్స్ వద్ద సోమవారం రాత్రి అదే కాలనీకి చెందిన అఖిల్, ఆటో మణి, వారి స్నేహితులు రాళ్లతో దాడి చేసి గాయపరిచారు. ఇంటికి వెళ్లిన వరప్రసాద్, శ్రీనివాసులు వారి స్నేహితులు కలిసి అఖిల్‌ను కొట్టాలని అతడి ఇంటికి వెళ్లారు. అయితే అక్కడ అఅఖిల్ లేకపోవడంతో అతని తల్లి ఉమాదేవిపై దాడి చేశారు. వినాయక విగ్రహం వద్ద జరిగిన చిన్నపాటి వాగ్వాదమే ఈ దాడికి కారణమని పోలీసులు తెలిపారు.

వరద బాధితులకు సాయం

ప్రశాంతి నిలయం: విజయవాడలో వరద ప్రభావిత ప్రాంతాల బాధితల సహాయార్థం సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ తనవంతుగా నిత్యావసర వస్తువులు, దుస్తులను ఆదివారం ప్రశాంతి నిలయం నుంచి రెండు ట్రక్కుల ద్వారా పంపింది. మేనేజింగ్ ట్రస్టీ ఆర్‌జె.రత్నాకర్ రాజు ప్రత్యేక పూజలు చేసి ట్రక్కులను సాగనంపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరద బాధితులకు ప్రతి ఒక్కరూ తమవంతు సాయం అందించాలని కోరారు.

సీఎం రిలీఫ్ ఫండ్‌కు కళాజ్యోతి విరాళం

ధర్మవరం కళాజ్యోతి సాంస్కృతిక సంస్థ ఏపీ సీఎం రిలీఫ్ ఫండ్‌కు రూ.1,01,116 విరాళం ప్రకటించింది. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో కలెక్టర్ టీఎస్ చేతన్‌ను కలిసిన కళాజ్యోతి సాంస్కృతిక సంస్థ బృందం డీడీ రూపంలో ఈ మొత్తాన్ని అందజేసింది. కార్యక్రమంలో కళాజ్యోతి సంస్థ అధ్యక్షుడు నారాయణ, గౌరవాధ్యక్షుడు వెంకటనారాయణ, కార్యదర్శి రామకృష్ణ, ఉపాధ్యక్షుడు శింగనమల రామకృష్ణ, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

వరద బాధితులకు 'స్పందన'

ధర్మవరం అర్బన్: వరద బాధితులకు ధర్మవరం స్పందన ఆస్పత్రి వైద్యులు డాక్టర్ టీఎం బషీర్, వై.సోనియా సాయం అందించి దాతృత్వం చాటుకున్నారు. గన్నవరంలో ఏర్పాటు చేసిన మెడికల్ క్యాంపులో రోగులకు 500 బెడ్‌షీట్లు, బెడ్ స్ప్రెడ్స్ ఎన్టీఆర్ కృష్ణాజిల్లా డీఎంహెచ్‌ఓ సుహాసినికి సోమవారం అందించారు.